క్లుప్తంగా

రక్తదాన శిబిరం ఏర్పాటు



కావలి : చేవూరు గ్రామ పరిధిలోని ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంపెనీ మానవ వనరుల విభాగపు అధికారి సింహాద్రి హరీష్ మాట్లాడుతూ ఇండోసోల్ సోలార్ కంపెనీలో 63 మంది ఉద్యోగులు రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రక్త కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

సీతారామపురం : మండల పరిధిలో నెల నుంచి జరుగుతున్న రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు బుధవారం సింగారెడ్డిపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు రెండు అగ్రిమెంట్లకు సంబంధించిన అర్జీలు రాగా వాటిని తిరస్కరించారు. మొత్తం మీద 425 అర్జీలు రాగా వాటిలో 12 అర్జీలకు మాత్రమే పరిష్కారం చూపించారు. మిగిలిన 413 అర్జీలకు పరిష్కారం నిర్ణీత గడువులోగా చూపనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

11 నుంచి క్రికెట్ టోర్నీ

సీతారామపురం : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్‌షెల్టర్ ప్రాంగణంలో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు మండల స్థాయి క్రికెట్ టోర్నీని జరుపుతున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3 వేల నగదు అందిస్తామన్నారు. టోర్నీలో పాల్గొనే వారు ఎంట్రీ ఫీజు రూ.500, బాల్‌ఫీజు రూ.100 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 95021 73319, 97011 69872 నంబర్లను సంప్రదించాలన్నారు.

సంగం మాజీ జెడ్పీటీసీ మృతి



తుంగా ఇందూధర్‌రెడ్డి(ఫైల్)

సంగం : మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు తుంగా ఇందూధర్‌రెడ్డి(54) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని తరుణవాయికి చెందిన ఆయన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కాగా ఆయన మృతి పట్ల ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సంతాపం తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేత్రపర్వం.. అలఘునాథుని కల్యాణం



ఆత్మకూరు : పట్టణంలోని పురాతన ఆలయమైన అలఘునాథస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం బుధవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ ఘట్టం వేడుకగా జరిగింది. ఉభయకర్తలుగా వ్యవహరించిన బాబు సింగ్, ఝాన్సీబాయ్‌లు కల్యాణానికి ముందు స్వామివారికి బంగారు ఆభరణాన్ని సమర్పించారు.

తహసీల్దార్‌కు సన్మానం



సోమశిల : మండల పరిధిలోని ఉప్పలపాడులో రెవెన్యూ సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుభాషిణిని సర్పంచ్ ఊరిబిండి ప్రశాంతిరెడ్డి సన్మానించారు. గ్రామ నాయకులు బొద్దుకూరు వెంకటేశ్వర‌రెడ్డి, మహేష్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వల్లభనేని రాజేంద్రకు అభినందన



ఆత్మకూరురూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన వల్లభనేని రాజేంద్రకు ఆయన స్వగ్రామమైన కరటంపాడులో పార్టీ నేతలు బుధవారం అభినందనలు తెలిపారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు దనాల రమేష్‌నాయుడు, నాగేశ్వరరావు, సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, మైనార్టీ నాయకులు అలీఖాన్, సాబ్‌జాన్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రూ. 8 కోట్లు.. మట్టిపాలు

2014–19 మధ్య రూ.25 కోట్లతో రోడ్డు నిర్మాణం మొదలు పెట్టారు. అయితే కొద్ది రోజులకే నాణ్యత సరిలేదని పలువురు ఫిర్యాదులు చేయడంతో క్వాలిటీ కంట్రోల్ సీఈ విచారణ చేసి నాణ్యత లేదని గుర్తించారు. అప్పటికే చేసుకున్న రూ.8 కోట్ల బిల్లులను రికవరీ చేయాలని ఆదేశించారు. ఇది గత టీడీపీ ప్రభుత్వ కాలంలో జరిగితే ఇంత వరకు చర్యలు తీసుకోకపోగా మళ్లీ అదే రోడ్డు ప్యాచ్‌వర్కులకు రూ.40 లక్షల మంజూరుకు సిద్ధపడడం గమనార్హం.

- రోడ్డు వేసిన కొద్ది నెలలకే దెబ్బతిన్న వైనం
- సీఈ పరిశీలన అనంతరం రికవరీకి ఆదేశించినా బేఖాతర్
- ఆత్మకూరు–సోమశిల రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ చేతివాటం
- గత టీడీపీ ప్రభుత్వంలోనే నిర్వాకం
- ఆలస్యంగా వెలుగులోకి..



ఆత్మకూరు–సోమశిల మార్గంలో పడమటికంభంపాడు వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

ఆత్మకూరు: ఆత్మకూరు–సోమశిల రోడ్డు నిర్మాణం కోసం అప్పట్లో టెండర్లు పిలిచారు. 17వ కిలోమీటరు నుంచి 40వ కి.మీ వరకు రోడ్డు విస్తరణ, అభివృద్ధి కోసం రూ.25 కోట్ల అంచనాలు రూపొందించారు. దీనిని 2015లో 16 శాతం లెస్‌తో ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. అప్పట్లో నిర్మాణ పనులు జరుగుతుండగా స్థానిక ప్రజలు నాణ్యతా పరంగా లోపాలు ఉన్నాయని జిల్లా, రాష్ట్ర అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో అప్పటి క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీరే స్వయంగా విచారణకు వచ్చారు. రోడ్డు పనులను పరిశీలించి నాణ్యత లేదని.. పనులు నిలిపివేయాలని ఆదేశించారు. అప్పటికే ఆ కాంట్రాక్టర్‌కు చెల్లించిన రూ.8 కోట్ల బిల్లులు రికవరీ చేయాలని ఆదేశించారు. దీనిపై సంబంధిత అధికారులపైన చర్యలు తీసుకోవాలని క్వాలిటీ కంట్రోల్ సీఈ ఆదేశించారు. ఇది జరిగి సుమారు తొమ్మిదేళ్లు గడిచింది.

వెలుగులోకి ఇలా..

గతేడాది కాగ్ అధికారులు ఆడిటింగ్ నిర్వహిస్తుండగా ఆత్మకూరు–సోమశిల రోడ్డు నిర్మాణ పనుల్లో డొల్లతనం వెలుగులోకి వచ్చింది. దీంతో కాగ్ అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇన్ని సంవత్సరాలు గడిచినా రికవరీ ఎందుకు చేయలేదని, తిరిగి రోడ్డు నిర్మించాలని సీఈ ఆదేశించిన విషయాన్ని ఎందుకు అమలు పరచలేదని ఆర్‌అండ్‌బీ అధికారులను ప్రశ్నించారు. సదరు పనిని ఎందుకు నిలిపివేయకుండానే ప్యాచ్‌వర్క్‌ల కోసం టెండర్లు పిలుస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. దీంతో రూ.25 కోట్ల రోడ్డు ప్రాజెక్ట్ విషయం, నిర్మాణంలో డొల్లతనం విషయం వెలుగులోకి వచ్చింది. ఇది జరిగి నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు కిమ్మనకుండా ఉండడం గమనార్హం.

బీజీల్లోనూ లొసుగులే

సాధారణంగా టెండర్ ద్వారా రోడ్డు వేసేటప్పుడు కాంట్రాక్టర్ బ్యాంకు గ్యారెంటీ (బీజీ) అందజేస్తారు. పనులు పూర్తయిన అనంతరం కాంట్రాక్టర్ ఇచ్చిన బీజీని తిరిగి అతనికి ఇచ్చేస్తారు. ఇది కాంట్రాక్ట్ పనుల్లో విధానం. అయితే ఆత్మకూరు–సోమశిల పని విషయంలో ఆ కాంట్రాక్టర్ బీజీని అధికారులు రెన్యువల్ చేస్తున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. అయితే ఈ వ్యవహారంలో ఆర్‌అండ్‌బీ అధికారులకు భారీగా ముడుపులు ముట్టడంతో కాంట్రాక్టర్‌ను వెనకేసుకుని వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ప్యాచ్‌లకు మళ్లీ నిధులు

ఏకంగా పనులే నిలిపివేయాలని సీఈ ఆదేశించినా అమలు చేయని అధికారులు ప్యాచ్‌వర్క్‌ల కోసం రూ.40 లక్షలు ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు. ఆ రోడ్డు ఫైల్‌ను క్లోజ్ చేయాలని ఉన్నతాధికారి ఆదేశించినా ఖాతరు చేయకుండా సదరు కాంట్రాక్టర్ బీజీలను రెన్యువల్ చేస్తుంటే కొత్తగా పనులు చేసేందుకు టెండర్లు పిలవడం సాధ్యంకాదు. ఈ విషయాన్ని సంబంధిత శాఖ సిబ్బందే పేర్కొనడం గమనార్హం.

నిత్యం నరకయాతన

ఆత్మకూరు–సోమశిల రోడ్డులో ఏటా ప్యాచ్ వర్క్‌లకు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయినా ఈ మార్గంలో ప్రయాణించే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మంచాలపల్లి, పడమటికంభంపాడు, ఉప్పలపాడు గ్రామాల వద్ద భారీ గుంతలతో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి లోతు తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణం కొనసాగిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన ఈ డొల్ల పనులకు ఇప్పటి కూటమి ప్రభుత్వంలోనైనా విముక్తి కలుగుతుందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్యాచ్‌వర్కులకు నిధుల మంజూరు వాస్తవమే

దీనిపై ఆర్‌అండ్‌బీ ఈఈ మురళీకృష్ణను సంప్రదించగా పనులు పరిశీలించి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నా. రికవరీ చేయాలని ఆదేశించలేదు. తిరిగి ఈ కాంట్రాక్టర్ ద్వారానే రోడ్డు నిర్మించాలని సీఈ ఆదేశించారు. ఇందుకోసం ఏ మేరకు రోడ్డు పనులు చేయాలనే అంశంపై నివేదికను త్వరలో ఉన్నతాధికారులకు అందజేస్తా. అనంతరం వారి ఆదేశాల మేరకు అమలు చేస్తాం. ప్యాచ్‌వర్క్‌లకు నిధులు మంజూరు చేయించి కొంత మేర పనులు చేసిన విషయం వాస్తవమే.

ఇబ్బందులు పడుతున్నాం



గత కొన్నేళ్లుగా ఈ గుంతల రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాం. ఊరి మధ్యలో ఉండే గుంతల రోడ్డులో భారీ లారీలు పలు మార్లు ఇరుక్కొని నానా పాట్లు పడ్డారు. ఈ రోడ్డు వ్యవహారం గురించి అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదు. మరమ్మతులు చేస్తారో, నూతన రోడ్డు నిర్మిస్తారో తెలియడంలేదు. ఇప్పటికైనా అధికారులు మా ఇక్కట్లు పరిశీలించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి.

– కొమ్మూరు అంజయ్య, మంచాలపల్లి



మంచాలపల్లి బస్టాండ్ వద్ద రోడ్డు దుస్థితి



మంచాలపల్లి గ్రామ నడిబొడ్డున గుంతలమయంగా ఉన్న రోడ్డు



సోమశిల సమీపంలో రోడ్డు దుస్థితి

ఆదర్శంగా కావలి మహిళా కండక్టర్లు



మహిళా కండక్టర్లకు నగదు బహుమతి అందజేత

కావలి : కావలి డిపోలో పనిచేస్తున్న మహిళా కండక్టర్లు ఆదర్శంగా రాణిస్తున్నారని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు అన్నారు. ఆర్టీసీ గ్యారేజీలో ఉత్తమ ఉద్యోగుల అభినందన సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నెల ఆదాయ లక్ష్యంలో 106 శాతం సాధించి కె.రమాదేవి ప్రథమ స్థానం, 105 శాతం సాధించి ఐ.సునీత రెండో స్థానం, 104 శాతం సాధించి కె.సుభాషిణి తృతీయ స్థానంలో నిలిచారన్నారు. పురుష కండక్టర్లతో పోటీపడి అత్యధిక కలెక్షన్ సాధించడం గర్వకారణమని అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కల్పన పేర్కొన్నారు. అనంతరం వారికి డిపో మేనేజర్ నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం.రామకృష్ణ, సెక్యూరిటీ అధికారి కేకే రావు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుక పంపిణీ



మర్రిపాడు : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సాహో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు సంక్రాంతి కానుకను బుధవారం పంపిణీ చేశారు. ఎంఈఓ ధనలక్ష్మి, ఎస్సై శ్రీనివాసరావు హాజరై వీటిని అందించారు. అలాగే పది, ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ పడసాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకులకు శిక్షణ

ఆత్మకూరురూరల్ : ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. పని ప్రదేశంలో చేపట్టాల్సిన కొలతలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏపీఓ శిరీషారెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపల్



మర్రిపాడు : క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై

ఆత్మకూరు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే శారీరిక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం పెంపొందుతాయని ఆత్మకూరు ఎస్సార్‌జేడీ కళాశాల ప్రిన్సిపల్ వరకుమారి అన్నారు. వీఎస్‌యూ పరిధిలోని అంతర్ కళాశాలల జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం కళాశాల మైదానంలో ప్రారంభించారు. వర్సిటీ పరిశీలకుడు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కళాశాల పీడీ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రిన్సిపల్ తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. తొలిరోజు జరిగిన మ్యాచ్‌లో ఉదయగిరికి చెందిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆత్మకూరుకు చెందిన ఎస్సార్‌జేడీ కళాశాలలు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయని పీడీ తెలిపారు. అధ్యాపకులు శ్రీనివాసులురెడ్డి, రమణయ్య, వెంగళరావు, మధుసూదన్‌రెడ్డి, అంకమ్మ, చెన్నకేశవులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తితో రాణించాలి

మర్రిపాడు : యువత క్రీడాస్ఫూర్తితో ఆటల్లో రాణించాలని మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెగళ్లపాడు పంచాయతీ ఉమ్మాయపల్లిలో క్రికెట్ టోర్నీని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత స్నేహపూర్వక వాతావరణంలో క్రీడలు నిర్వహించుకోవాలన్నారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఏఓ సత్యవాణి

అల్లూరు : మండలంలోని రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) పి.సత్యవాణి తెలియజేశారు. అల్లూరు మండలం సింగపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె బుధవారం పాల్గొన్నారు. ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని, వరికి సంబంధించి ఎకరానికి రూ.168 చెల్లిస్తే పంట నష్టం జరిగితే రూ.42 వేలు వస్తాయని తెలియజేశారు. 15వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజీరావు, నాగరాజు, మండల ఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- కలిగిరి : రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని ఏఓ సురేష్‌బాబు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ వరకు వరి పంటకు బీమా చేసుకునే అవకాశం ఉందన్నారు. రైతులు సంబంధిత వ్యవసాయ సహాయకులను కలిసి నమోదు చేయించుకోవాలని సూచించారు.
- అనుమసముద్రంపేట : మండలంలోని గుంపర్లపాడు, వేల్పులగుంట గ్రామాల్లో మండల ఏఓ టి.రజనీ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ దేవసేనమ్మ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలన్నారు. ఏఈఓ చిరంజీవి, వీఏఏ హేమంత్ పాల్గొన్నారు.
- సీతారామపురం : ప్రతి రైతు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని మండల ఏఓ చెన్నారెడ్డి కోరారు. ఆయన బుధవారం సింగారెడ్డిపల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సాగులో ఉన్న మినుము పంటను పరిశీలించి రసం పీల్చు పురుగును గుర్తించి నివారణ చర్యలు సూచించారు. ఏఈఓ సాంబశివయ్య, వీఏఏలు స్వప్న, నరేంద్ర పాల్గొన్నారు.

ఆఫ్రాన్ పనులను పూర్తి చేయాలి



సోమశిల : సోమశిల జలాశయం ముందు భాగాన జరిగిన ఆఫ్రాన్ పనులను సీపీఎం నేతలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి చంద్రా రాజగోపాల్ మాట్లాడుతూ సోమశిల ఆఫ్రాన్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటినా జలాశయాన్ని అభివృద్ధి చేయలేదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు పుల్లయ్య తదితరులు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ఉదయగిరి : పట్టణ శివారు గండిపాళెం రోడ్డు మార్గంలో పెట్రోల్ బంకు సమీపంలో బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. సీతారామపురం మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన డేవిడ్ స్థానిక ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో వంట మనిషిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా గేదెను తప్పించబోయి బైక్ అదుపుతప్పి పడింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఉదయగిరి సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు.

భారీగా తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



జగనన్నతో రామిరెడ్డి, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి

కావలి : ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో తాడేపల్లిలో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నిర్వహించిన సమావేశానికి కావలి నాయకులు భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, కీలక నాయకులను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధినేతకు పరిచయం చేశారు.

అప్రమత్తంగా ఉండండి

- డాక్టర్ కీర్తి ప్రియ



చేజర్ల : వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేజర్ల పీహెచ్‌సీ వైద్యురాలు కీర్తి ప్రియ అన్నారు. ఈ మేరకు ఆమె బుధవారం మాట్లాడుతూ చలిగాలులతో కూడిన మంచు కురుస్తోందని, ఉదయం వేళల్లో 8 గంటలు దాటిన తర్వాత బయటకు రావాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని, అవసరమైతే వారిని సంప్రదించాలని కోరారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలవాలి



ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే

వింజమూరు(ఉదయగిరి) : విభిన్న ప్రతిభావంతులకు సమాజం అండగా నిలవాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. స్థానిక ఎస్వీ కన్వెన్షన్ హాల్లో బుధవారం ఉదయగిరి నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ వింజమూరులో బుధవారం జరిగింది. ఇందులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే సురేష్‌తో కలిసి కలెక్టర్ పాల్గొని, వీటిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. జిల్లాలో ఉదయగిరి ప్రాంతంలో విభిన్న ప్రతిభావంతులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి 140 మందికి అందజేశామని చెప్పారు. వీటి నిర్వహణ బాధ్యత కూడా ఫౌండేషన్ ద్వారానే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అజీజ్, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



కావలి : సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని స్థానిక జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని సృజనాత్మకంగా రంగవల్లులు తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్వోదయ విద్యా సంస్థల రెక్టార్ డి.వినయ్‌కుమార్‌రెడ్డి విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. దొడ్ల లక్ష్మీరెడ్డి, కళాశాల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు, స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ మాల్యాద్రి పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచుకోవాలి



తాగునీటి పథకాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దుత్తలూరు : తాగునీటి పథకాలను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసి పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.మోహన్‌రావు తెలిపారు. ఆయన మండలంలోని బ్రహ్మేశ్వరం గ్రామంలో సీపీడబ్ల్యూఎస్ వాటర్‌స్కీమ్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీటి పథకాలపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మీసాల సుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శులు నజీముల్లా, మల్లికార్జున, నాగరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఎస్సీలకు అన్యాయం జరిగితే సహించం



అల్లూరు : ఎస్సీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. అల్లూరు మండల కేంద్రంలో ఆయన బుధవారం మాట్లాడారు. ఇతర కులాలకు చెందిన వారిని ఎస్సీ జాబితాలో చేర్చారని, వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు దానం మాల్యాద్రి, గాలి వేణుగోపాల్, ముసలి నరేంద్ర, పొంగులూరు సుధాకర్, గంగపట్నం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష అధికారి పరిశీలన

ఉదయగిరి : ఉదయగిరిలోని దళితవాడ ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రాలను జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అడిషనల్ కో–ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులపై ఆరా తీశారు. అనంతరం ఎంఈఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ క్రమంలో పలువురు ఉపాధ్యాయులు వెంకటసుబ్బయ్యను సన్మానించారు. ఎంఈఓ తోట శ్రీనివాసులు ఉన్నారు.